


EVENING EDITION

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

4PM
www.suryaa.com
గురువారం
08-01-2026
పేజీలు: 02




# అందుకే రాజకీయాల్లోకి వచ్చా..

## మంత్రి నారా లోకేశ్



క్రమశిక్షణ, పట్టుదలతో ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని, ప్రజలు ఏ నమ్మకంతో గెలిపించారో ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. సాక్షి పత్రికపై వేసిన పరువునష్టం కేసులో న్యాయం తన వైపు ఉందని, తప్పకుండా గెలుస్తానని పేర్కొన్నారు. తనపై సాక్షి పత్రిక ప్రచురించిన అసత్య కథనంపై పరువునష్టం కేసులో బుధవారం విశాఖ 12వ అదనపు జిల్లా న్యాయస్థానంలో క్రాస్ ఎగ్జామినేషన్ కు మంత్రి హాజరయ్యారు. క్రాస్ ఎగ్జామినేషన్ ముగిసిన అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, 2019లో ఆనాడు టీడీపీ ఓడిపోయినప్పుడు కుట్రపూరితంగా తప్పుడు వార్తలు రాసి, వ్యక్తిగతంగా తన పరువుకు భంగం కలిగించాలని తన ఫోటో పెట్టి, కింద క్యారికేచర్ వేసి అసత్య కథనం ప్రచురించారని అన్నారు. తాను విశాఖకు వచ్చినప్పుడు ఐదేళ్లలో ఎయిర్ పోర్ట్ లాంజ్ లో స్నాక్స్ కు రూ.25 లక్షలు ఖర్చుపెట్టానని రాశారని గుర్తు చేశారు. 'చినబాబు చిరుతిండికి 25 లక్షలండి' అనే టైటిల్ తో ఏకంగా తన ఫోటో పెట్టి ఆర్టికల్ రాశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ రోజు నుంచే తాను సాక్షిపై పోరాటం మొదలుపెట్టానని, ఎవరిపైనైనా ఆర్టికల్ రాసేప్పుడు నిజానిజాలు నిర్ధారించుకోవాలని సూచించారు. సంబంధిత వ్యక్తికి ఫోన్ చేసి వారి అభిప్రాయం తెలుసుకోవాలని, అలాంటివేవీ చేయకుండా తనను కించపరిచేవిధంగా సాక్షిలో ఆర్టికల్ రాసి పబ్లిష్ చేయడం జరిగిందని మండిపడ్డారు. దీనిపై గత ఆరేళ్లుగా తాను పోరాటం చేస్తున్నానని, ఈ కేసుపై విశాఖకు రావడం ఇది ఏడోసారి అని తెలిపారు. ఆ రోజు ద వీక్ అనే మేగజైన్ కూడా ఆర్టికల్ రాసినప్పుడు నోటీసులు పంపానని, ఏ తేదీల్లో అయితే ప్రచురించారో ఆ తేదీల్లో తాను విశాఖలో లేనని ఆధారాలతో సహా నిరూపించానని అన్నారు. అది తెలుసుకుని వారు రీజాయిండర్ వేసి, క్షమాపణలు కూడా కోరినట్లు తెలిపారు. "2014-19 మధ్య గానీ, ఇప్పుడు గానీ నేను విశాఖకు వచ్చినప్పుడు ప్రభుత్వం నుంచి టికెట్ కూడా తీసుకోవడం లేదు, గెస్ట్ హౌస్ లో కూడా నేను ఉండటం లేదు. నేను వినియోగించే రెండు వాహనాలు కూడా ప్రభుత్వ వాహనాలు కావు. వాటి డీజిల్ ఖర్చు కూడా నాదే. నేను తాగే వాటర్ బాటిల్, కాఫీ ఖర్చు కూడా నాదే. ఎయిర్ పోర్ట్ లాంజ్ లో నాయకులతో ఐదు నిమిషాలు మాట్లాడాలంటే కాఫీ, కాఫీ పౌడర్, చివరకు మగ్గు కూడా నాదే. ఇది మా అమ్మగారు నాకు నేర్పించిన సంస్కృతి. ప్రజాస్వామ్యంలో ఉన్నాం. ప్రజలు పవిత్రమైన బాధ్యత మనపై పెట్టారు. వారు ఏ నమ్మకంతో మనల్ని గెలిపించారో ఆ నమ్మకం నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ఏ ఖర్చులు ఉన్నా కుటుంబపరంగా మేం భరిస్తాం. ఇంట్లో అమ్మ, బ్రాహ్మణి సంపాదిస్తే.. చంద్రబాబు గారు, నేను ఖర్చుపెడుతున్నాం. నా క్రెడిట్ కార్డు బిల్లు కూడా బ్రాహ్మణి కడుతున్నారు. పారదర్శకంగా ఉండాలనే ఆలోచనతో మేం చేస్తున్నాం. నేను ఎప్పుడు విశాఖకు వచ్చినా టీడీపీ కార్యాలయం లోనే బస చేస్తున్నాను. కార్యకర్తలను కలిసిన తర్వాతనే ఏ కార్యక్రమానికైనా వెళ్లడం జరుగుతోంది" అని అన్నారు.

## మమతా బెనర్జీ
# కీలక ప్రకటన

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ రాష్ట్ర ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( ఎస్ఐఆర్ ) ప్రక్రియను సవాల్ చేస్తూ.. అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్తానని స్పష్టం చేశారు. తాను కూడా న్యాయవాదినేనని.. అవసరమైతే ప్రజల పక్షాన తాను వాదిస్తానని తెలిపారు. బీజేపీ, ఎన్నికల సంఘం తీరుపై మమతా బెనర్జీ తీవ్రంగా మండిపడ్డారు. ఓటర్ల పేర్లను తొలగించడం, వృద్ధ ఓటర్లను ఇబ్బంది పెట్టడం వంటి అన్యాయాలను ఎంతమాత్రం సహించబోమని ఆమె స్పష్టం చేశారు. ఈ విషయంలో తమ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్, సుప్రీంకోర్టును ఆశ్రయిస్తుందని, అవసరమైతే తాను ప్రజల తరపున వాదిస్తానని తెలిపారు. తాజాగా దక్షిణ 24 పరగణాల జిల్లా సాగర్ ఐల్యాండ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో మమతా బెనర్జీ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ పేరిట జరుగుతున్న అన్యాయాలను ఎదిరించడానికి మేము చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. త్వరలోనే కోర్టుకు వెళ్తాం. ప్రజల కోసం సుప్రీంకోర్టులో వాదిస్తాను. న్యాయవాదిగా కాదు, ఒక పౌరురాలిగా ప్రజల తరపున వాదిస్తాను. క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో వివరిస్తాను అని చెప్పుకొచ్చారు.



## ఏపీ కేబినెట్ భేటీ.. పలు కీలక అంశాలపై
# సీఎం చంద్రబాబు చర్చ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఇవాళ(గురువారం) ఏపీ సచివాలయంలో మంత్రి మండలి సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై సీఎం చర్చిస్తున్నారు. దాదాపు 38కు పైగా అజెండా అంశాలపై మంత్రివర్గ సమావేశంలో సీఎం మాట్లాడుతున్నారు. ఏపీ లాజిస్టిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఏర్పాటు ఆమోదం తెలపనుంది. ఎంఎస్ఎంఈ పరిధిలో ఏపీ క్లస్టర్ డెవలప్‌మెంట్ కార్యక్రమానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. దాదాపు రూ.200కోట్లతో 45 ఎంఎస్ఎంఈ కామన్ ఫెసిలిటీ కేంద్రాల ద్వారా వచ్చే ఐదేళ్లలో 500మందికి ఉపాధి కల్పనే లక్ష్యంగా క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం అమలు చేయనుంది. రాష్ట్రంలో వివిధ పరిశ్రమల ఏర్పాటుకు పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డులో తీసుకున్న నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం తెలపనుంది.



## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

సంక్రాంతి పండుగ వేళ తెలంగాణలోని రైతులకు ఊరటనిచ్చేలా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ధరణి వెబ్ పోర్టల్ వల్ల ఏర్పడిన భూసమస్యల పరిష్కారానికి నడుం బిగించింది. వీలైనంత త్వరగా ధరణిలో నెలకొన్న భూముల సమస్యలను పరిష్కరించి రైతుల ఇబ్బందులను తీర్చేందుకు మరింత సమయమిచ్చింది. ఇందులో భాగంగా ఏప్రిల్ 13 వరకు ప్రభుత్వం గడువు పొడిగించింది. ఈ గడవులోగా ధరణిలో తప్పుగా నమోదైన భూముల వివరాలను మార్చుకోవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసింది. సాంకేతిక, రికార్డు పరమైన తప్పులను రైతులు సరిదిద్దుకోవచ్చని తెలిపింది. రైతులందరూ భూభారతి కార్యక్రమం ద్వారా సులభంగా తప్పులు సరిద్దుకోవచ్చని రేవంత్ సర్కార్ వెల్లడించింది. ఒకరి భూమి మరొక పేరు మీదకి వెళ్లడం, సర్వే నెంబర్లు తప్పుగా పడటం, భూమి విస్తీర్ణంలో తేడాలు పడటం, నిషేధిత జాబితాలో ఉండటం వంటి అన్నింటిల్లో రైతులు మార్పులు చేసుకోవచ్చు.

## గుడివాడలో టీడీపీ సానుభూతిపరుడి
# కిడ్నాప్ కలకలం

జిల్లాలోని గుడివాడలో టీడీపీ సానుభూతిపరుడు దుగ్గిరాల ప్రభాకర్ కిడ్నాప్ అంశం తీవ్ర కలకలం రేపింది. గత ప్రభుత్వ పెద్దల అవినీతిపై ఫిర్యాదులు చేశారనే కారణంతో అతన్ని కిడ్నాప్ చేసినట్లు తెలుస్తోంది. ఈ అంశంలోనే అతన్ని బెదిరించి.. రాత్రి సమయంలో వదిలేసినట్లు బాధిత వ్యక్తి కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. ప్రభాకర్ బుధవారం ఉదయం తొమ్మిదిగంటలకు తన బైక్‌పై మచిలీపట్నం వెళ్తుండగా.. పెడన వద్ద గుర్తు తెలియని వ్యక్తులు అతన్ని కిడ్నాప్ చేశారు. అనంతరం నిర్మానుష్య ప్రాంతంలోకి తీసుకెళ్లి సాయంత్రం వరకు నిర్బంధించారు. బెదిరింపులకు గురి చేసి.. రాత్రి సమయంలో అతన్ని వదిలేశారు. దుండగులు వదిలేయడంతో ప్రభాకర్ నేరుగా గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేరారు.

## ఫిబ్రవరిలో ఎప్‌సెట్ నోటిఫికేషన్



ఇంజినీరింగ్, ఫార్మసీ వంటి కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీజీ ఎప్‌సెట్ నోటిఫికేషన్ ఫిబ్రవరిలో విడుదల కానున్నది. ఫిబ్రవరి మొదటి వారంలోనే సమగ్ర నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఎప్‌సెట్ కాకుండా ఎడ్‌సెట్, ఐసెట్, లాసెట్ వంటి మిగిలిన ప్రవేశ పరీక్షల నోటిఫికేషన్లు సైతం ఫిబ్రవరిలోనే విడుదల చేయాలన్న భావనలో అధికారులు ఉన్నారు. సెట్ కన్వీనర్ల సమావేశాన్ని బుధవారం మాసబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి సెట్ కన్వీనర్లకు పలు సూచనలు చేశారు. ఇంటర్ సెకండియర్ హాల్‌టికెట్లు విడుదలయ్యాక ఎప్‌సెట్ ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవుతుందని ఎప్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

# యష్ 'టాక్సిక్' టీజర్ రిలీజ్




కన్నడ రాకింగ్ స్టార్ యష్ అభిమానుల నిరీక్షణకు ఎట్టకేలకు తెరపడింది. యష్ పుట్టినరోజును పురస్కరించుకుని ఆయన నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్-వరల్డ్ మూవీ 'టాక్సిక్' టీజర్‌ను మేకర్స్ నేడు విడుదల చేశారు. కేజీఎఫ్ తర్వాత దాదాపు నాలుగేళ్ల గ్యాప్ తీసుకున్న యష్ ఈ టీజర్‌తో బాక్సాఫీస్ వద్ద మరో సునామీ సృష్టించడం ఖాయమని నిరూపించారు. దాదాపు మూడు నిమిషాల నిడివి ఉన్న ఈ టీజర్ ప్రారంభం నుంచే ప్రేక్షకులను ఒక భయంకరమైన గ్యాంగ్‌స్టర్ ప్రపంచంలోకి తీసుకెళ్లింది. ఇందులో యష్ పాత్ర పేరు రాయ అని తెలుస్తుంది. శత్రువుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించేలా స్మశానవాటిక సెటప్‌లో యష్ కారుతో ఇచ్చే ఎంట్రీ సీన్ హైలైట్‌గా నిలిచింది. పొడవాటి జుట్టు, గుబురు గడ్డం, నోట్లో సిగార్.. చేతిలో అత్యాధునిక గన్‌తో యష్ మునుపెన్నడూ లేనంత స్టైలిష్‌గా, క్రూరంగా కనిపిస్తున్నారు. టీజర్ చివరలో గన్‌తో ఫైర్ చేస్తూ యష్ చెప్పే ''డాడీ ఈజ్ హోమ్'' అనే డైలాగ్ థియేటర్లలో విజిల్స్ వేయించడం గ్యారెంటీ. దర్శకురాలు గీతూ మోహన్ దాస్ ఈ చిత్రాన్ని కేవలం ఒక యాక్షన్ సినిమాగా కాకుండా, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఒక 'డార్క్ ఫెయిరీ టేల్'గా తీర్చిదిద్దారు.



# ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలనం
## సీఎం రేవంత్ సోదరుడు కొండల్ రెడ్డికి సిట్ నోటీసులు!



తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ క్రమంలోనే తాజాగా ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డికి ప్రత్యేక విచారణ బృందం నోటీసులు జారీ చేయడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కొండల్ రెడ్డిని బాధితుడిగా గుర్తిస్తూ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. గతంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ ప్రక్రియలో భాగంగా కొండల్ రెడ్డికి సంబంధించిన సంభాషణలను కూడా అక్రమంగా విన్నట్లు సిట్ అధికారులు ప్రాథమిక ఆధారాలు సేకరించారు. ఈ వ్యవహారానికి సంబంధించి మరిన్ని లోతైన వివరాలను రాబట్టడానికి ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఈ కేసులో ఇప్పటికే పలువురు పోలీసు అధికారులను విచారించిన సిట్, ఇప్పుడు నేరుగా ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుడినే పిలవడం కేసు తీవ్రతను తెలియజేస్తోంది. సిట్ జారీ చేసిన నోటీసుల ప్రకారం, రేపు ఉదయం విచారణాధికారుల ముందు కొండల్ రెడ్డి హాజరుకావాల్సి ఉంటుంది.

# హాట్‌గా
# దిశా పటాని

తెలుగులో ఎంతో మంది ముద్దుగుమ్మలు తమ అందచందాలతో, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కానీ ఆతర్వాత టాలీవుడ్ కు దూరం అయ్యారు. తెలుగులో కొన్ని సినిమాలే చేసి ఆ తర్వాత బాలీవుడ్ కు చెక్కేసినవారు చాలా మంది ఉన్నారు. కొంతమంది ముద్దుగుమ్మలు ఒకటి రెండు సినిమాలతోనే పరిమితం అవుతున్నారు. ఇప్పుడు ప్రపంచం మొత్తం టాలీవుడ్ వైపే చూస్తుంది. ఎంతో మంది తెలుగులో సినిమాలు చేయడానికి రెడీ అవుతున్నారు. ఇప్పటికే ఇతర భాషల నుంచి వచ్చిన ముద్దుగుమ్మలు తెలుగులో టాప్ హీరోయిన్స్ గా రాణిస్తున్నారు. ముఖ్యంగా కన్నడ నుంచి వచ్చిన ముద్దుగుమ్మలు మన దగ్గర స్టార్ హీరోయిన్స్ అయ్యారు. తెలుగు సినిమాలతోనే విపరీతమైన క్రేజ్ తెచ్చుకున్నారు. అలాగే బాలీవుడ్ నుంచి కూడా చాలా మంది భామలు వచ్చారు. పైన కనిపిస్తున్న హీరోయిన్ కూడా బాలీవుడ్ నుంచి వచ్చిన మన దగ్గర స్టార్ గా మారింది. చేసింది రెండు సినిమాలే కానీ స్టార్ డమ్ సొంతం చేసుకొని ఎంతో మంచి కుర్రాళ్ళ హాట్ ఫేవరేట్ హీరోయిన్ గా మారిపోయింది. చేసిన రెండు సినిమాల్లో ఒకటి డిజాస్టర్ కాగా ఓ సినిమా సంచలన విజయం సాధించింది. కానీ ఈ బ్యూటీకి ఆఫర్స్ మాత్రం లేదు. ఇప్పుడు ఒకొక్క సినిమాకు రూ. 3 కోట్లు వసూల్ చేస్తుంది ఈ చిన్నది.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధర.. పెరిగిన వెండి రేటు

వరుసగా పెరుగుతూ వస్తున్న బంగారం ధరలు గురువారం కాస్త ఉపశమనం కలిగించాయి. స్వల్పంగా తగ్గుదల నమోదు చేశాయి. అయితే వెండి మాత్రం జోరు చూపిస్తూనే ఉంది. గురువారం కూడా పెరుగుదల నమోదు చేసింది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారం, వెండిపై మదుపర్లు దృష్టి సారిస్తున్నారు. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా బంగారం, వెండి ధరల డిమాండ్‌కు కారణంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ రోజు (జనవరి 8న) ఉదయం 6:30 గంటల సమయంలో హైదరాబాద్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1,38,260కి చేరింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,26,740కి చేరింది. ఇక, దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రేటు రూ. 1,39,640కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ. 1,28,010కి చేరుకుంది. మరోవైపు వెండి కూడా జోరు చూపిస్తోంది. నిన్నటితో పోల్చుకుంటే కిలోకు వంద రూపాయల మేర పెరిగింది. ఈ నేపథ్యంలో దేశంలోని పలు ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం..



# ఖమ్మం ప్రయాణికులకు ఊరట..

సంక్రాంతి వేళ మున్నేరు పాత వంతెనపైకి వాహనాలకు అనుమతి
ముంచుకొస్తున్న సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఖమ్మం నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. పండుగ పూట నగరంలోని ప్రధాన రహదారులు ప్రయాణికులతో కిక్కిరిసిపోయే అవకాశం ఉండటంతో, వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు వినూత్న ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగానే నగరంలోని కాల్వవోడ్డు వద్ద ఉన్న మున్నేరు పాత వంతెనపై వాహనాల రాకపోకలకు సంబంధించి ట్రాఫిక్ పోలీసులు తాజాగా కీలక ప్రకటన విడుదల చేశారు. సాధారణంగా పాత వంతెనపై ఉండే పరిమితులను పక్కన పెట్టి, ప్రస్తుత రద్దీ దృష్ట్యా కార్లు మరియు ఆటోల రాకపోకలకు తాత్కాలికంగా అనుమతి ఇస్తున్నట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ వెల్లడించారు. ఖమ్మం చుట్టుపక్కల ప్రాంతాల నుండే కాకుండా, ఇతర జిల్లాలకు వెళ్లే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో ఈ వెసులుబాటు కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీనివల్ల నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ నూతన నిబంధనలు నేటి నుండే అమల్లోకి వచ్చాయని, జనవరి 20వ తేదీ వరకు ఈ సడలింపు కొనసాగుతుందని పోలీసులు స్పష్టం చేశారు. పండుగ ముగిసి ప్రయాణికుల రద్దీ సాధారణ స్థితికి వచ్చే వరకు ఈ ఏర్పాట్లు అందుబాటులో ఉంటాయని వారు తెలిపారు.

# భారత్ సహా పలు దేశాలపై 500 శాతం సుంకాలు..

కొత్త బిల్లు తెస్తున్న ట్రంప్
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ముగించేందుకు రష్యాపై మరింత ఒత్తిడి పెంచే దిశగా ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. రష్యాతో వ్యాపారం చేసే దేశాలపై ద్వితీయ ఆంక్షలు విధించే ద్వైపాక్షిక బిల్లుకు ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రష్యా నుంచి చమురు, యురేనియం కొనుగోలు చేసే దేశాలపై అమెరికా అధ్యక్షుడికి 500 శాతం వరకు సుంకాలు పెంచే అధికారాన్ని ఈ బిల్లు ఇస్తుంది. రిపబ్లికన్ సెనేటర్ లిండ్సే గ్రాహం అధ్యక్షుడు ట్రంప్‌తో భేటీ అయిన తర్వాత ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ బిల్లు చైనా, భారత్, బ్రెజిల్ వంటి దేశాలపై ఒత్తిడి పెంచి, రష్యా చమురు కొనుగోళ్లు ఆపేలా చేస్తుందని, అది పుతిన్ చేస్తున్న యుద్ధానికి నిధులు లేకుండా చేస్తుందని గ్రాహం చెప్పారు. ఈ



బిల్లు వచ్చే వారం సెనేట్‌లో ఓటింగ్‌కు రావచ్చని తెలిపారు. రష్యా నుంచి చమురు కొనుగోలుదారుల్లో చైనా మొదటి స్థానంలో ఉండగా, భారత్ రెండో స్థానంలో ఉంది. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు చేస్తున్న కారణంగా భారత్ పై ట్రంప్ గత ఏడాది 50 శాతం సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ కొత్త బిల్లు మరింత కఠినమైన చర్యలకు దారి తీస్తుంది.
భారత్-అమెరికా మధ్య వాణిజ్య చర్చలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ఒకవైపు ఉక్రెయిన్-రష్యా మధ్య శాంతి చర్చలు జరుపుతూనే... మరోవైపు ఈ ఆంక్షల బిల్లుకు మద్దతు ఇవ్వడం రష్యాపై ఒత్తిడి పెంచే వ్యూహంగా కనిపిస్తోంది. యుద్ధం ఆపుతామని చెబుతూనే అమాయకుల్ని పుతిన్ చంపుతున్నారని గ్రాహం మండిపడ్డారు. ఈ బిల్లు ఆమోదం పొందితే రష్యా ఆర్థిక వ్యవస్థపై పెద్ద దెబ్బ పడుతుంది. రష్యా నుంచి చమురు కొనుగోలు విషయంలో భారత్, చైనా పునరాలోచన చేయాల్సిన అవసరం వస్తుంది.

# పదో తరగతి విద్యార్థులకు సర్కార్ 'తీపి కబురు'

తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగనున్న పదో తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు మరియు వారి ఆరోగ్యంపై దృష్టి సారించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం సాయంత్రం వేళల్లో బలవర్ధకమైన అల్పాహారం (ఈవెనింగ్ స్నాక్స్) అందించాలని నిర్ణయించిన విద్యాశాఖ, ఇందుకు సంబంధించి తాజాగా రూ. 4.23 కోట్ల భారీ నిధులను విడుదల చేసింది. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వేల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది.
వార్షిక పరీక్షల సన్నద్ధతలో భాగంగా పాఠశాలల్లో ప్రతిరోజూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఉదయం నుంచి సాయంత్రం వరకు చదువుతో నిమగ్నమయ్యే విద్యార్థులు నీరసించకుండా ఉండేందుకు ఈ స్నాక్స్ ఎంతగానో దోహదపడతాయి. ఫిబ్రవరి 16వ తేదీ నుంచి ప్రారంభించి మార్చి 10వ తేదీ వరకు ఈ అల్పాహార పంపిణీ కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జిల్లా విద్యాశాఖ



అధికారుల (DEOs) పర్యవేక్షణలో ఈ నిధుల వినియోగం మరియు నాణ్యమైన ఆహార పంపిణీ జరగనుంది.
పదో తరగతి పరీక్షల షెడ్యూల్ ప్రకారం మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు తుది పరీక్షలు జరగనున్నాయి. ఈ కీలక సమయంలో విద్యార్థులు ఏకాగ్రతతో చదివేలా ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమం ఒక ఊతంగా నిలవనుంది. ప్రతిరోజూ సాయంత్రం వేళల్లో రాగి జావ, శనగలు లేదా పల్లీ పట్టీల వంటి పోషక విలువలు కలిగిన పదార్థాలను అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. విద్యార్థులు శారీరకంగా, మానసిక దృఢంగా ఉంటేనే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించగలరని విద్యాశాఖ ఈ ప్రత్యేక చొరవ తీసుకుంది.
ప్రభుత్వ ఆదేశాల మేరకు నిధుల విడుదల ప్రక్రియ పూర్తి కావడంతో, క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను అధికారులు వేగవంతం చేశారు. విద్యార్థుల హాజరుకు అనుగుణంగా మెనూను రూపొందించి, ఎక్కడా లోపాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీఈవోలకు సూచించారు. పరీక్షల ముంగిట ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాణ్యమైన స్నాక్స్ అందించడం ద్వారా విద్యార్థుల్లో ఉత్సాహం పెరిగి, వారు మరింత ఉత్సాహంగా పరీక్షలకు సిద్ధమయ్యే అవకాశం ఉంటుంది.

# రంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం.. నలుగురు విద్యార్థులు మృతి

రంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. కారు చెట్టును ఢీకొనడంతో నలుగురు విద్యార్థులు దుర్మరణం చెందారు. ఈ విషాదకర సంఘటన మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలోని మీర్జాగూడ గేటు వద్ద చోటు చేసుకుంది. ఐబీఎస్ నుంచి 5మందితో వెళ్తున్న కారు..చెట్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సూర్య తేజ, సుమిత్,శ్రీ నిఖిల్,రోహిత్ అనే నలుగురు విద్యార్థులు చనిపోగా.. నక్షత్ర అనే విద్యార్థిని తీవ్రంగా గాయపడింది. వీరంతా ఐబీఎస్ కాలేజీకి చెందిన బీబీఏ చదువుతున్న విద్యార్థులుగా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఉర్దూ వర్సిటీ భూముల స్వాధీనంపై బండి సంజయ్ ఫైర్

హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఉన్న మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీకి కేటాయించిన భూముల్లో 50 ఎకరాలను తిరిగి స్వాధీనం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. యూనివర్సిటీ అవసరాల కోసం ఉన్న భూములను ప్రభుత్వం వెనక్కి తీసుకోవడం వెనుక భారీ కుట్ర దాగి ఉందని ఆయన ఆరోపించారు. విద్యాసంస్థల అభివృద్ధికి తోడ్పడాల్సింది పోయి, ఇలా భూములను లాక్కోవడం విద్యా వ్యవస్థను దెబ్బతీయడమేనని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ.. విలువైన ఈ భూములను అమ్మి సొమ్ము చేసుకోవాలనే దురాలోచనలో పాలకులు ఉన్నారని బండి సంజయ్ మండిపడ్డారు. సామాన్య ప్రజలకు ఉపయోగపడాల్సిన ప్రభుత్వ ఆస్తులను కబ్జా చేస్తున్న వారిని వదిలేసి, విద్యా సంస్థలపై ప్రతాపం చూపడం ఏంటని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్ణయాలు పారదర్శకంగా లేవని, కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే ఈ 50 ఎకరాలపై కన్ను వేశారని ఆయన ఘాటుగా విమర్శలు చేశారు. ముఖ్యంగా ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీని ఉద్దేశించి మాట్లాడుతూ.. సల్కం చెరువును ఆక్రమించి విద్యా వ్యాపారం చేస్తున్న వారిపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. చట్టం అందరికీ సమానంగా ఉండాలని, కానీ ఇక్కడ ప్రభుత్వం ఒకరికి కొమ్ముకాస్తూ మరొకరిని ఇబ్బంది పెడుతోందని ఆరోపించారు. అక్రమ కట్టడాలపై లేని నిబంధనలు, విద్యాసంస్థల భూముల విషయంలో ఎందుకు తెరపైకి వస్తున్నాయని ఆయన అడిగిన ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. గత నెలలో కలెక్టర్ నోటీసులు ఇవ్వడం ద్వారా మొదలైన ఈ వివాదం, రాబోయే రోజుల్లో మరింత ముదిరేలా కనిపిస్తోంది. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని బండి సంజయ్ హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఈ అంశంలో వెనక్కి తగ్గేదే లేదని, భూముల స్వాధీన ప్రక్రియను ఆపే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. దీంతో ఈ భూముల వ్యవహారం ఇప్పుడు రాజకీయ రంగు పులుముకుంది.





# కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించిన ఆయన, అమరావతికి రాజధానిగా చట్టబద్ధత కల్పించాలని ప్రధానంగా విజ్ఞప్తి చేశారు.పోలవరం ప్రాజెక్టు పర్యటనను ముగించుకుని నేరుగా ఢిల్లీకి వెళ్లిన చంద్రబాబు, అమిత్ షాతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా, అమరావతిని ఏపీ రాజధానిగా ఖరారు చేస్తూ పార్లమెంటులో ఒక బిల్లును ప్రవేశపెట్టి చట్టబలం కల్పించాలని కోరారు. ఇలా చేయడం వల్ల రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేరడమే కాకుండా, రాష్ట్ర అభివృద్ధి కూడా వేగవంతం అవుతుందని ఆయన వివరించారు.అలాగే, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కేంద్రం తీసుకొచ్చిన 'జీ-రామ్-జీ' పథకంలోని నిబంధనలపైనా చంద్రబాబు చర్చించారు. ఈ పథకంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల వాటాను 60:40 నిష్పత్తికి మార్చడం వల్ల, ఇప్పటికే ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్‌పై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకుని, ఈ విషయంలో ప్రత్యామ్నాయ ఆర్థిక వెసులుబాటు కల్పించాలని కోరారు.ఆర్థికంగా క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న రాష్ట్రాన్ని తిరిగి గాడిన పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అందిస్తున్న సహకారానికి చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులోనూ ఇదే తరహా మద్దతును కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని తాజా పరిణామాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరుపై కూడా ఇరువురు నేతలు సమీక్షించుకున్నారు.



# మా ఇంటి బంగారం

అగ్ర కథానాయిక సమంత ప్రధాన పాత్రలో రూపొందుతున్న ఫ్యామిలీ యాక్షన్ డ్రామా 'మా ఇంటి బంగారం'. సమంతతో సూపర్‌హిట్ 'ఓ బేబీ' చిత్రాన్ని తెరకెక్కించిన నందినీరెడ్డి ఈ చిత్రానికి దర్శకురాలు కావడం విశేషం. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరులతో కలిసి సమంత నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్నది. ప్రచారంలో భాగంగా ఈ సినిమా టీజర్ ట్రైలర్‌ను ఈ నెల 9న విడుదల చేయనున్నట్టు చిత్రబృందం బుధవారం అధికారికంగా ప్రకటించింది. ఈ టీజర్ ట్రైలర్ ప్రేక్షకులకు ఉద్వేగపూరితమైన అనుభూతిని ఇవ్వనుందని ఈ సందర్భంగా ప్రకటనలో చిత్రబృందం పేర్కొన్నది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో సమంత సీరియస్ లుక్‌లో కనిపించారు. ఆమె పాత్రలోని ఇంటెన్సిటీని ఈ స్టిల్ ఆవిష్కరించింది. దిగంత్, గుల్షన్ దేవయ్య కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో గౌతమి, మంజూషా ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.



# నాకు ఆ రెండూ ఇష్టమే: కంగనా రనౌత్

హీరోయిన్ కంగనా రనౌత్ సోషల్ మీడియాలో ఎప్పుడూ ఫ్యాన్స్‌తో టచ్‌లో ఉంటుంది. ఇదే క్రమంలో తాజాగా కంగనా రనౌత్ తన ఫాలోవర్స్‌తో ముచ్చటిస్తూ.. కొన్ని ప్రశ్నలకు ఆసక్తికర సమాధానమిచ్చింది. ఓ నెటిజన్ కంగనా రనౌత్ ను ప్రశ్నిస్తూ.. 'మీకు రాజకీయాలు ఇష్టమా ? లేక, సినిమాలు ఇష్టమా ?' అని అడిగారు. ఈ ప్రశ్నకు కంగనా రనౌత్ సమాధానమిస్తూ.. 'మనకు ఒకటే నచ్చాలని లేదు కదా. కాలం మారేకొద్దీ ఇష్టాలు మారతాయి. ప్రతి కొత్త విషయం మనకు ఓ పాఠం నేర్పుతుంది. నాకు రెండు ఇష్టమే' అని కంగనా తెలిపింది. మరో నెటిజన్ ప్రస్తుతం మీరు ఓన్ చేస్తున్న మీ తదుపరి ప్రాజెక్ట్ ఏంటి ? అని అడగగా.. కంగనా రనౌత్ మాట్లాడుతూ.. 'ఓ కథ పై వర్క్ జరుగుతుంది. వచ్చే ఏడాదిలో ఆ సినిమా షూటింగ్ ప్రారంభమవుతుంది' అని కంగనా క్లారిటీ ఇచ్చింది.